# గంగులు

శీలా వీర్రాజు

**గంగులు గజదొంగ; గుండెలు తీసిన బంటు; నిర్దాక్షిణ్యంగా ఎవరి ప్రాణాలు అయినా తీసే నరరూప రాక్షసుడు; నిజమే. అయితే ఏమి? తల్లి ప్రాణం హరించి పుడమిపై పడిన పసికంగు అమాయికమైన ఆక్రందనంతో మ్రోడైన అతని హృదయం తిరిగి చిగురించింది.**



సైరను భయంకరంగా అరచింది. ఆ శబ్దం ఎత్తయిన జైలుగోడల్ని దాటి నిద్రపోతోన్న ప్రాణుల గుండెల్లోకి వ్యాపించింది. సమయంకాని సమయంలో సైరను అలా వూర కుక్కలా అరిస్తే అందరి గుండెలూ బిక్కు బిక్కు మంటూ భయంతో నిండి పోతాయి. దాని శబ్దంలోని కాఠిన్యం రానున్న మహాప్రళయానికి, గొప్ప విపత్తుకు చిహ్నం.

అరడజనుసార్లు సైరను వుండి వుండి అరచింది. నిద్రపోతున్న ప్రజల్లో పెద్ద సంచలనం తుఫానులా లేచింది. ఆ తుఫానుల్లో సన్నని రెల్లు దుబ్బుల్లాంటి పిరికి వాళ్లు గజగజా కంపించిపోయారు. బిడాయించుకున్న తలుపుల్ని తెరచుకొని వీధుల్లో కొచ్చి, నలుగురైదుగురు కలిసి ఒక గుంపై 'ఎందుకూ ?' అని ప్రశ్నించుకొంటున్నారు. కొంతమంది అసలు కారణం తెలుసుకుందామని జైలు వైపు పరుగెత్తారు.

గజదొంగ గంగులు జైలునుండి పారిపోయాడన్న వార్త అరగంటలో వూరల్లా వ్యాపించింది. అంతా తలోక విధంగా అతని గురించి చెప్పుకొంటున్నారు. అతని పేరు ఉచ్చరిస్తున్న ప్రతీవారూ గుండెల్లో ధైర్యాన్ని గుత్తకు తెచ్చుకొని చుట్టూ కలయచూసి భయంభయంగా గుసగుసలాడుతున్నారు. కొంత మంది—తమ ప్రాణాల్ని ధనంతో తూకం వేసే అతి దాహం మనుషులు — సీలువేసిన యినపపెట్టెల్లా తలుపుల్ని తాళాలతో బిగించి ముసుగుల్ని కప్పుకున్నారు.

గంగులు పేరు చెప్తే అక్కడివారందరికీ హడల్. ఐదారు ప్రాణాల్ని సులభంగా, నిర్భయంగా తీసినవాడు గంగులు. లక్షాధికారి గుండెల్లో సింహస్వప్నం. ఏ క్షణంలోనన్నా వచ్చి మీద పడతాడేమోనని ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని గజ గజ లాడుతుంటారు వాళ్లు.

రహస్యమైన అతని చర్యల గురించీ, విచిత్రమైన పన్నుగడల గురించీ అక్కడంతా ఆశ్చర్యంగా చెప్పుకొంటుంటారు. గత కొద్ది నెలల క్రిందట ఒక లక్షాధికారి ఇంట్లో కన్నంవేసి, అతను అల్లరిచేస్తే అతని ప్రాణాల్ని తీసి పారిపోయి అజ్ఞాతంగా గడుపుతూ పోలీసులకు చిక్కిపోయాడు. కేసు దర్యాప్తు చేసి ఉరిశిక్ష విధించారు. మరో వారం రోజుల్లో అతని ప్రాణవాయువులు గిలగిలా తన్నుకొని అనంతవాయువుల్లో కలసి

# గంగులు

పోతాయి ! ఒక భయంకరమైన చావు— విపన్నమైన బలవంతపు గతిలేని చావు చస్తాడతను !

చావంటే అతనికి భయంలేదు. కాని ఆ చావునుండి అతను తప్పించుకొని పారి పోవాలనుకున్నాడు. పిరికివాళ్ళు చచ్చే చావది. వాళ్ళల్లా తను చావడం అతనికి ఇష్టం లేదు.

ఒక రాత్రి చీకటి రాకాసి విశాలంగా వూరంతటినీ ఆవరించినప్పుడు, దాని నల్లని జుత్తులాంటి మేఘాలు ఒత్తుగా వ్యాపించి నప్పుడు, ఆ మేఘాలు భయంకరంగా గర్జిస్తూ మహాప్రళయాన్ని సృష్టిస్తున్న ప్పుడు అతను అతి తెలివిగా కాపలావాడిని తప్పించుకొని ఎత్తయిన జైలు కాంపౌండు వాలు దాటి దాని వెనుకవైపు తుప్పల్లోంచి, పొలాల్లోంచి పారిపోయాడు !

అతను పారిపోయాక, పారిపోయినట్టు గుర్తించాక జైలు వార్డర్లూ, ఆఫీసర్లూ నాలుగువైపులకూ పరుగెత్తారు. గట్లను, తుప్పల్ని వెతుక్కొంటూ జైలు చుట్టూరా పొలాల్ని, గ్రామాల్ని గాలించేస్తున్నారు. జైల్లో నాలుగు వైపులా అమర్చిన హెడ్ లైట్లు అరమైలు దూరం చీకట్లను చీలుస్తూ వెలుతుర్ని సృష్టిస్తున్నాయి.

గంగులు రెండు మైళ్ళ దూరం ఆగ కుండా పరుగెత్తాడు. దారిలో చీకటిలో మూడు నాలుగుచోట్ల గోతుల్లో పడి మోకాళ్ళు కొట్టుకుపోయాయి. చీకట్లో కనుపించక పెద్ద పెద్ద బండరాళ్లను తన్ని చేసి పాదాలను, వ్రేళ్లను చిదగ్గొట్టుకున్నాడు. వంటినిండా ముళ్లకంచెలు గుచ్చుకొని గీసుకు పోయాయి. రక్తంకూడా బయటపడింది. చీకట్లో బాధ తప్ప ఇంకేమీ తెలీడంలేదు. మోటయిన మనిషి గనుక వీటన్నింటినీ లెక్కచేయకుండా ఏకధాటిని రెండు మైళ్ళ పరుగెత్తాడు. ఇంకా పరుగెత్తేవాడే. అప్పటికి దగ్గర్లో మినుకు మినుకు మనే దీపాలతో ఏదో పల్లెటూరు అవుపించింది.

ఊరును చూడగానే గాయాల బాధ, ఆయాసం అధికమయ్యాయి. ఇక ముందుకు వెళ్ళడం సాధ్యంకాదనుకున్నాడు. బాధతోనే మూలుగుతూ, ఆతృతతో అంగలువేసి నడుస్తూ పొలంకంచె గట్టు తగిలి తూలిపోయి గోతిలో పడ్డాడు. గోతి అంచు బలంగా గుండెకు మోసింది. ఒక తుమ్మముల్లు పాదంలో లోతుగా గుచ్చుకుంది. 'అమ్మా' అని మూలిగాడు. క్రూరమైన ఆలోచనలతో గడ్డకట్టిన పాషాణంలాంటి గుండె బాధతో జాలిగా అరచింది ! అయిదు నిమిషాలవరకూ అతను కదలలేకపోయాడు.

దూరంగా ఏవో అరుపులు, విజిల్లు వినిపిస్తున్నాయి. నిశీధపు ఆకాశంలో నల్లని భూమీమీద హెడ్‌లైట్ల వెలుతురు ఇంకా పడుతూనే వుంది. ఆ వెలుతుర్ని చూసి జంతువులు, పక్షులు గోలగా అరుస్తున్నాయి. రాను రాను మనుషుల కలకలం, విజిల్ల శబ్దం మరీ గట్టిగా—ఇంకా దగ్గర దగ్గరగా వస్తున్నట్టు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

అయిదుసార్లు నిర్భయంగా ప్రాణాల్ని తీసినప్పుడు, తెగించి సంకెళ్ల బంధాల్ని దాటి జైలుగోడ దూకి పారిపోదామనుకున్నప్పుడు వుండే ధైర్యం ఇప్పుడతనిలో లేదు. ప్రాణాల్ని ఆవరించుకొని భయం రెక్కలు చాచింది.

గోతిలోంచి లేచి దుమ్ము దులుపుకొని కాళ్ళీడ్చుకొంటూ అక్కడనుండి బయలు దేరాడు. గుండె అదురు, గాయాల బాధ వుండేకొలదీ అధికమవుతున్నాయి. కాలుతీసి కాలుపెట్టడంకూడా సాధ్యం కావడంలేదు. అయినా ఎలాగో కాళ్ళీడుస్తున్నాడు.

దగ్గరగా ఏదో దొడ్డివయిపు ఇంటి గుమ్మం కనుపించింది. ఆ తాటాకుపాక పగిలిపోయిన దొడ్డిగుమ్మం రెక్కల కన్నా ల్లోంచి కిరసనాయిలు దీపపు వెలుతురు చారలు వాలుతున్నాయి. పాక వెనుక దాన్ని కప్పుతూ ఏవో రెండు చెట్లు గుబురుగా పెరిగివున్నాయి. చెట్లను, పాకను చుట్టి ఒక పాదు దట్టంగా అల్లుకొంది.

మెల్లగా వెళ్లి చెట్లవెనక పాదు వారనే కూర్చున్నాడు. ఊపిరి బిగబెట్టి చీకటిలోకి పొడుచుకొని చూస్తున్నాడు. కొంతమంది జెయిలు వార్డర్లు రావడం, వీధుల్లో నాలుగు చోట్లా వెతికి నిద్రపోతున్నవాళ్లను లేపి వాకబుచేసి వెళ్లిపోవడం—అంతా చాటుగా కూర్చొని చూశాడు. వాళ్ళు వెళ్లిపోగానే 'హమ్మయ్యా' అనుకున్నాడు.

దొడ్డితలుపు తీసుకొని ఒక ముసలమ్మ బయటకు వచ్చింది. ఆ చీకట్లో తడుము కొని తడుముకొని ఏదో వస్తువు తీసి వెళ్లి పోయి తిరిగి తలుపుదగ్గరగా చేరవేసుకొంది.

> ఓసారి గాలిబ్ కవి, రాజుగారి వెంట మామిడి తోటలోకి షికారు వెళ్ళాడు. తదేకంగా చెట్లవైపు చూస్తున్న కవిగార్ని రాజు అడిగాడు:
>
> "అంత దీక్షగా ఆ చెట్లవైపు ఎందుకు చూస్తున్నారు?" అని.
>
> గాలిబ్: "నా తండ్రి తాతల పేర్లు ఏ పండు మీదైనా కనబడతా యేమోనని."

గంగులు అక్కడకు వచ్చి కూర్చున్నప్పటి నుండీ ఏదో సన్నగా మూలుగు ఆ ఇంట్లో నుండి వినిపిస్తూనే వుంది. ఎవరో స్త్రీ గాబోలు నీరసంగా మూలుగుతోంది. నిశ్శబ్దపు లోకంలో, బాధల అగాధంలో ఏ జీవో ఏడుస్తున్నట్టుగా వుంది!

తలుపు దగ్గరగా వెళ్లి రెక్కల సందు లోంచి తొంగి చూశాడు గంగులు. కొండెక్కు తూన్న కిరసనాయిలు దీపం మసక వెలు తుర్లో ఒక స్త్రీ జీవితంలోని పాపాలకు ప్రాయశ్చిత్తంగా ప్రసవవేదన పడుతోంది.

కాలంతీరి పండిపోయిన ముసలమ్మ ఒకర్తె ఆమెకు సేవలు చేస్తోంది. ఆ ముసలమ్మ తప్పించి ఆమె దైన్యాన్ని, బాధను అర్థం చేసుకున్నవారు అక్కడ లేరు.

మళ్లీ తలుపులు తెరచుకున్నాయి. గంగులు అక్కడనుండి గబ గబా వెళ్లిపోబోయాడు. ఆమె అలికిడిని పసికట్టి "ఎవరూ ?" అంది. గంగులు ఆగిపోయాడు. ఏమీ తోచక "నేనూ" అన్నాడు. ఆమె లైటు తెచ్చి అతని ముఖంలో వెలుతురు పడేలా ఎత్తి "ఎవరయ్యా ?" అంది.

"పొరుగూరివాణ్ణి. అవతలి ఇంటి అరుగు మీద పడుకొంటే ఏదో మూలుగు వినిపించి ఏమిటా అని లేచి ఇల్లా వచ్చాను. . . ఏమిటి ? . . ఎవరు ?" అన్నాడు.

"అబ్బే నొప్పులు పడుతోంది నాయనా. నువ్వెవరవో తెలీదుకాని దేవుడిలా సమయానికి వచ్చావు. చూడు నాయనా, కాస్త పనిచేసి పెడతావా ? మంత్రసాని నర్సమ్మను పిలవాలి బాబూ" అంది.

ఆమె ముడతల ముఖంలో ఆవేదన, భయాల చారలు స్పష్టంగా అతను చూడ గలిగాడు. ఆమెమీద జాలి వేసింది. కాని పాదాలనిండా ముళ్ళు, శరీరంనిండా గీరుకు పోయి రక్తం కారుతూన్న చారలు, అడుగు కదిపి అడుగు వేయలేని అసహాయత— వీటన్నిటితో ఎలా వెళ్ళాలో అతనికి అర్థం కాలేదు. పాపం ! ఆమె విపరీతమయిన బాధ పడుతోంది. ఆమె ప్రాణానికి కూడా ముప్పు వచ్చేట్టు వుంది. ఎలాగో వోపిక చేసుకొని వెళ్తే రెండు జీవాల్ని రక్షించినవాడు కాగలడు తను. బయటికి వెళ్లితే పట్టుబడిపోతాననే భయం లేదు. వాళ్ళు ఎప్పుడో వెళ్లి పోయారు.

అప్రయత్నంగానే "ఊ" అన్నాడు. ఆమె మంత్రసాని ఇంటి గుర్తులు చెప్పింది.

అతను వెళ్లి మంత్రసానిని పిలుచుకు వచ్చాడు. అవసరమైతే తనను పిలవమని, ఎదురింటి అరుగుమీద వుంటానని చెప్పాడు. ఆమె అలానే అంది.

గంగులు అవతలి ఇంటి అరుగుమీద

కూర్చున్నాడు. అతనికి పూర్తిగా తన గాయాలమీద ధ్యాస పోయింది. అవతల నుండి ఆమె వుండి వుండి అరుస్తున్న అరుపులు, బాధగా మూలుగుతూన్న మూలుగులు ఆ పాషాణ హృదయాన్ని చిన్నాభిన్నం చేసేస్తున్నాయి. ఆ చుట్టూ వున్న వారిమీద అతనికి విపరీతమయిన కోపం వచ్చింది. 'ఇంత భయంకరంగా చావుబ్రతుకులతో ఆమె పోట్లాడుతూంటే ఇరుగు పొరుగువారు ఒక్కరూ రారేమిటి ?' అనుకున్నాడు. అందరినీ అసహ్యించుకొని సృష్టి ప్రసాదింప బోతోన్న బిడ్డ తొలి ఏడుపు విందామని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

అరగంట గడిచింది. నిరాశ ఎండు మోడు హృదయంలో చిన్న చిగురుటాకు అల తలయెత్తినట్టు, భయంకర బాధల కారడవిలో విశాలమైన చక్కటి ఆనందపు రాచబాట అగుపించినట్టు ప్రసవవేదనలోని తల్లి బాధల మూల్గుల్లో పసిపాప కంఠం 'కేర్... కేర్' మని వినిపించింది.

కాని అంతలోకే తెల్లని పాలవన్నె బుల్లి చంద్రుణ్ణి ప్రళయకాలపు నల్లని మేఘాల బాహువులు విశాలంగా వ్యాపించి ఆవరించినట్టు, ఆ పసిపాప అరుపుల్ని ఆవరించి ఆ ముసలి అవ్వ గొంతు చించుకొని ఏడుస్తోంది !

తల వంచుకొని, విఫలమైన తన హస్తలాఘవాన్ని నిందించుకొని మంత్రసాని బయటకు వచ్చింది. గంగులు ఆతృతగా ఆమె వద్దకు వెళ్లి "ఏమయిందీ ?" అన్నాడు.

"ఆ తల్లికి భూమ్మీద నూకలు లేవు. చేసిన పాపం పండింది" అంది నర్సమ్మ— అవి చీకట్లో దారి వెతుక్కొని ఆ దొడ్డి వెంటే వెళ్లిపోయింది.

"పాపం" అనుకున్నాడు గంగులు. గబగబా తలుపుల్ని తోసుకొని లోపలకు వెళ్లాడు. గాలికొట్టిన రబ్బరుబొమ్మలాంటి పిల్ల ముఖముఖాల కఠినంగా ప్రాణంలేని తల్లి హృదయానికి దగ్గరగా తన మానాన్న తను ఆడుకొంటోంది !

చావుబ్రతుకులు ఇంత సన్నిహితంగా వుంటాయనే సత్యం గంగులుకు అప్పుడు అర్థమయింది. ప్రాణాల్ని సులభంగా తీసివేసేసే అతను ఆమె చావును చూసి కన్నీళ్ళు కార్చాడు ! పాషాణంలాంటి అతని దయలేని హృదయం వెన్నలా కరిగిపోయింది.

"ఏం మామ్మా ! ఈమెకు దగ్గరివాళ్ళు ఎవరూ లేరూ ?" అన్నాడు.

ఆమె జాలిగా నవ్వింది. "ఉన్నారు. కాని ఉండి ఏం లాభం ? ఒక్కరూ ఆమె గొంతులో పిడికెడు మట్టి వెయ్యరు. వాళ్లంతా నీతి నియాయితీవున్న మనుషులు. ఈమె నీతిలేని ఆడది. సంఘం వెలివేసిన స్త్రీ."

"ఆమెకు నువ్వేమీ కావా ?" అతను తిరిగి అడిగాడు.

"ఏమీ కాను. నీలా కష్టాల్ని చూసి సహించలేని గుండె నాది. పిల్ల పుట్టేడు కష్టాల్లో వుంటే చూసి అంతా బయటి నుండి ఎగతాళి చేస్తున్నట్టుగా వెలికిగా నవ్వుతూంటే చూస్తూ వూరుకోలేకపోయాను. కాని ఏం లాభం ? ఇంతకన్నా ఆమెకు ఎక్కువ వ్రాసి లేదు. ఆయువు తీరింది." ఆమె కన్నీళ్లను తుడుచుకొని నిరాశగా నుంచుంది. అతను కూడా అలానే నుంచున్నాడు. ఇప్పు డా పసిపిల్ల గతి ఏంకావాలో అతనికి అర్థం కాలేదు. ఆ విషయమే అతను ఆమెను అడిగినప్పుడు ఆమె నిర్జీవంగా నవ్వి "పుట్టించినవాడు ఏ ఆధారమూ కలిగించకపోడు నాయనా. లోకం గొడ్డుపోలేదు. అక్కడక్కడ దయా దాక్షిణ్యాలు ఇంకా మిగిలి వున్నాయి. ఏ పుణ్యాత్ముడో ఆ పిల్లను పెంచి పెద్దచెయ్యకపోడు" అంది.

'ఎంత భారమైన బ్రతుకు' అనుకున్నాడతను. మరో విధంగా సానుభూతి చూపించడానికి ఇప్పు డతను చట్టప్రకారమూ శిక్షితుడు.

సానుభూతి చూపించే మార్గంలేక నిట్టూర్పి మెల్లగా అక్కడినుండి కదలి వూరువిడిచి వెళ్లిపోయాడు. తెల్లవారేసరికి కాళ్లీడ్చుకొని ఆ వూరు దాటి మూడు మైళ్ల దూరం వెళ్లి సురక్షితమైన ప్రదేశం చేరుకున్నాడు. అక్కడ తమ గుంపులోని ఒకడి ఇంట్లో ఆశ్రయం లభించింది.

చీకటి తెరలు, మంచుపొగలు వెలుతురి వేడిలో కరిగి లోపలి తమ అందమైన ఆకారాలతో ప్రకృతి ఇంకా ప్రత్యక్షం కాకుండానే, మనుషులు తమ తమ బద్ధకాన్ని సగం సగం మగతను పూర్తిగా దులుపుకోకుండానే గంగులు జెయిలునుండి పారిపోయాడన్న వార్త చుట్టుపట్ల పది గ్రామాలమేరకు ప్రాకిపోయింది. ఆ వార్త నలుగురి నోళ్ల మీదుగా పోగానే ఒక కొత్త రూపాన్ని తొడుక్కొని, అక్కడమ్నుండి పదిమంది ద్వారా వెళ్లి రెండు శకాలై—ఇంకా వెళ్లే కొలది 'అర్థమెటిక్ ప్రోగ్రషన్' లా ఒకదానినొకటి గుణించుకొంటున్నాయి. చీకటిపడే సమయానికి వంద రకాల కథలు అతనిమీద ప్రచారంలో వున్నాయి.

ఆ రోజల్లా అతను ఆ యింట్లోనే గడిపాడు. అనేక ఆలోచనలతో అతని మనసు నిండిపోయింది. గతరాత్రి దృశ్యం మాటి మాటికి అతని కళ్ళముందుకొచ్చి నుంచుంటోంది. ఏడుస్తున్న పసిపాప ముఖం, చైతన్యం లేని కళాకాంతులు పోని అస్తమించిన ఆ తల్లి ఆకారం, ఏకాకుల్లాంటి ఆ జీవితాలు, అసహ్యించుకోబడిన వాళ్ళ బ్రతుకులు— అన్నీ అతని ముందు తిరుగాడుతున్నాయి.

'ఆ అమ్మాయిని తను పెంచుకుంటే?' అనుకున్నాడు.

(తరువాయి 41 వ పేజీలో)

## సవరించరా కుంచె!

హృదినుంచి మసినించి
చిత్రించరా ఒల్లి
జిల్లనే చిత్రాల

నీలోన లీనమై
నిలిచియుండే నిజము
వెలుగునీడల లోని
వైవిధ్యమే పార ॥

మొగ్గలోనే విరుల
మ్రగ్గజేసెడు నరుల
కృత్యాలలో నున్న
సత్యాలనే యెన్న ॥

మృగరాజు కలగాంచి
మగత నిద్దుర నుంచి
వడిలేచి పరుగెత్తు
పసిలేడి భయమొప్ప ॥

చలిలోన జడివాన
జడిపించ చదలంటి
కలతచెందే కలువ
కరుణగాథల దెలుప ॥

కాకమ్మ మదినెంతో
గరళమ్ముతో నింపు
కోయిలమ్మా పుటక
మాయమర్మము మలచ ॥

దూర తీరాలలో
పారాడు పరమేష్ఠి
బిరబిరా నీదరికి
పరుగెత్తు పగిదిగా.

—జనపాల బాలవెంకటరెడ్డి